సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత



చెక్కులను అందజేస్తున్న బండి రమేష్ తదితరులు

కూకట్‌పల్లి: వివిధ డివిజన్‌లోని 15 మంది కుటుంబాలకు చెందిన లబ్ధిదారులకు రూ.5.90 లక్షల విలువ గల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ పార్టీ కార్యాలయంలో గురువారం అందజేశారు. సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. కార్యక్రమంలో గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ అధ్యక్షుడు నాగిరెడ్డి, మహిళా అధ్యక్షురాలు కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

బాలానగర్: ఫతేనగర్ వార్డు కార్యాలయం ఆవరణలో మేడిస్టార్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని గురువారం ఏర్పాటు చేశారు. శిబిరాన్ని కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. బీపీ, షుగర్ తదితర టెస్టులు చేసి మందులు అందజేశారు. మహిళలకు గైనిక్ సంబంధిత టెస్టులు చేశారు. శిబిరంలో సుమారు 200 మంది పరీక్షలు చేయించుకున్నారు.

మూసాపేట బంద్ ప్రశాంతం



బంద్ సందర్భంగా మూసిన షాపులు

మూసాపేట: మూసాపేట బంద్ గురువారం సంపూర్ణంగా, ప్రశాంతంగా జరిగింది. నగరంలో ముత్యాలమ్మ తల్లి ఆలయంపై దాడికి నిరసనగా హిందూ సంఘాల పిలుపు మేరకు ప్రజలు స్వచ్ఛందంగా షాపులు మూసివేసి బంద్‌లో పాల్గొన్నారు. మూసాపేట పరిసర ప్రాంతాలు, భరత్‌నగర్, కూకట్‌పల్లిలో బంద్ నిర్వహించారు. అత్యవసర సేవలైన ఆసుపత్రులు, మెడికల్ షాపులు తప్ప అందరు బంద్‌లో పాల్గొన్నారు. హిందూ ఆలయాలపై దాడులు చేస్తే సహించేది లేదని నాయకులు హెచ్చరించారు. దాడులను అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం తనిఖీ



వివరాలు తెలుసుకుంటున్న రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ డీఐజీ మధుసూదన్‌రెడ్డి

సుభాష్‌నగర్: సూరారంలోని కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ డీఐజీ మధుసూదన్‌రెడ్డి జిల్లా రిజిస్ట్రార్ అశోక్‌తో కలిసి గురువారం తనిఖీ చేశారు. నిత్యం 100కు పైగా రిజిస్ట్రేషన్ అయ్యే ఈ కార్యాలయంలో 60 శాతం మేర రిజిస్ట్రేషన్ పడిపోవడంపై ఆరా తీశారు. కుత్బుల్లాపూర్‌లోని సర్వే నెంబర్ 55 నుంచి 226 వరకు 171 సర్వే నెంబర్లలో వక్ఫ్ బోర్డు భూములు ఉన్నాయని కొంత మంది ఫిర్యాదుతో అందులో రిజిస్ట్రేషన్లు చేయవద్దని ఆగస్టులో వక్ఫ్ బోర్డు నుంచి ఆదేశాలు రావడంతో నిలిపివేసినట్లు అధికారులు తెలిపారు. సంబంధిత అధికారులతో మాట్లాడి వారం రోజుల్లో సమస్యను పరిష్కరించే విధంగా కృషి చేస్తామని మధుసూదన్‌రెడ్డి తెలిపారు.

పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలి



మొక్కకు నీళ్లు పోస్తున్న సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి

దుండిగల్: విధి నిర్వహణలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని, ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి దర్యాప్తు చేపట్టాలని సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి అన్నారు. మేడ్చల్ డీసీపీ పరిధిలోని దుండిగల్ పోలీస్ స్టేషన్‌ను గురువారం తనిఖీ చేశారు. మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి, అడిషనల్ డీసీపీ పురుషోత్తం, ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి పోలీస్ స్టేషన్ ఆవరణను పరిశీలించారు. రిసెప్షన్‌లో ఫిర్యాదుల స్వీకరణ, వివిధ అంశాలపై ఆరా తీశారు. సిబ్బందికి సలహాలు, సూచనలు చేశారు. అనంతరం సీపీ అవినాష్ మహంతి మాట్లాడుతూ..సైబర్ నేరాలు విపరీతంగా పెరిగిపోతున్నాయని, వాటిని అరికట్టేందుకు పోలీస్ వ్యవస్థ కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుందన్నారు. ఏ ప్రాంతంలోనైనా నేరం జరిగితే జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి సత్వరమే బాధితులకు న్యాయం చేస్తున్నామన్నారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. స్థానిక పోలీసుల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో దుండిగల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సతీష్, డీఐ సతీష్, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



గాంధీ భవన్‌లో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్‌మున్షీతో కాంగ్రెస్ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షురాలు విద్యాకల్పన ఏకాంత్ గౌడ్ తదితరులు - ఆల్విన్ కాలనీ





చిన్నారులు ఆడుకునే వస్తువులు, వాకింగ్ ట్రాక్

పార్కును ప్రారంభించరా?

నాటి ప్రభుత్వం సుమారు రూ.2 కోట్ల వ్యయంతో రెండు ఎకరాల్లో అత్యాధునిక సదుపాయాలతో ఎన్విరాన్‌మెంట్ పార్కును తీర్చిదిద్దింది. ఎన్నికలకు కొన్ని నెలల ముందు శంకుస్థాపన చేసి పనులను తొందరగానే ముగించారు. సకల సౌకర్యాలతో పచ్చదనంతో పార్కును తీర్చిదిద్దారు. ఎన్నికలు రావటంతో పార్కు ప్రారంభోత్సవం వాయిదా పడింది. సుమారు రెండు సంవత్సరాలు కావస్తున్నప్పటికీ ఆ పార్కును అందుబాటులోకి తీసుకురాకపోవటంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పార్కును అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.



స్వచ్ఛబడి పార్కు ప్రవేశద్వారం

- రూ. 2 కోట్లతో రెండు ఎకరాల్లో ఏర్పాటు
- సందర్శకులను ఆకట్టుకునేలా పచ్చదనం
- ప్రజలకు అందుబాటులోకి రాని వైనం

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని ఆస్‌బెస్టాస్ కాలనీ, పాపిరెడ్డినగర్ కాలనీల మధ్య గల స్వచ్ఛబడి (హుడా) పార్కును నాటి రాష్ట్ర ప్రభుత్వం ఎన్విరాన్‌మెంట్ పార్కు కోసం అందమైన పార్కుగా తీర్చిదిద్దింది. సకల సౌకర్యాలు కల్పించారు. ఎన్నికలకు ముందు హడావుడిగా శంకుస్థాపన చేసి పనులను కూడా అంతే శరవేగంతో పార్కు అభివృద్ధికి బాటలు వేశారు. నూతన ప్రభుత్వం ఏర్పడి 10 నెలలు కావస్తున్నప్పటికీ ప్రారంభోత్సవానికి నోచుకోలేదు. ఎన్విరాన్‌మెంట్ పార్కు పేరుతో పార్కులో ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మించటానికి ప్లాస్టిక్ వస్తువుల రీసైక్లింగ్ కోసం మౌలిక వసతుల కల్పన, మొక్కల పెంపకం, ఆరోగ్య పరిరక్షణ పట్ల అవగాహన కల్పించే విధంగా ఏర్పాటు చేశారు. నూతన టెక్నాలజీతో కూడిన ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ వస్తువుల ద్వారా స్క్రీన్‌లు సైతం ఏర్పాటు చేశారు. నగరంలోనే ఈ స్వచ్ఛబడి పార్కును ఎన్విరాన్‌మెంట్ పార్కుగా సందర్శకులను ఆకట్టుకునేలా తీర్చిదిద్దారు. కోట్ల రూపాయలతో నిర్మించిన పార్కును ప్రారంభించాలని కాలనీ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

మేమే ప్రారంభించుకుంటాం



ఎన్విరాన్‌మెంట్ పార్కు తమ కాలనీలో ఏర్పాటు అవుతుందని ఎంతగానో ఆనందపడ్డాం. ప్రభుత్వం మారటంతో ఈ పార్కు ప్రారంభానికి నోచుకోకపోవడంతో అందరం దిగులు చెందాం. వాకింగ్, యోగా చేసుకునేవాళ్లం. ప్రస్తుతం దానికి కూడా అవకాశం లేకుండా పోయింది. స్వచ్ఛబడి పార్కును త్వరలో ప్రారంభం చేయకపోతే స్థానికులం అందరం కలిసి పార్కును మేమే ప్రారంభించుకుంటాం.

- సువర్ణ, స్థానికురాలు

భారీగా కాలం చెల్లిన టపాసులు స్వాధీనం



కేపీహెచ్‌బీకాలనీ: అనుమతి లేకుండా పెద్ద మొత్తంలో క్రాకర్స్‌ను నిల్వ ఉంచడమే కాకుండా కాలం చెల్లిన పటాకులను విక్రయించేందుకు ప్లాన్ చేసిన వ్యక్తిపై కేపీహెచ్‌బీ కాలనీ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మూసాపేట మారుతీనగర్‌కు చెందిన ముఖేష్ అగర్వాల్ అనే వ్యాపారి హైదర్‌నగర్ మెట్రో పిల్లర్ 658 సమీపంలో అక్రమంగా క్రాకర్స్‌ను నిల్వ ఉంచడమే కాకుండా భారీగా కాలం చెల్లిన టపాసుల విక్రయానికి ప్లాన్ చేశాడు. విషయం తెలుసుకున్న పోలీసులు దాడి చేసి రూ.1,71,407ల విలువ చేసే టపాసులను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ప్రభుత్వ కళాశాల విద్యార్థి




గోపీచంద్

మూసాపేట: కూకట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల మొదటి సంవత్సరం విద్యార్థి గోపీచంద్ తైక్వాండో పోటీల్లో జిల్లా స్థాయిలో మొదటి స్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించాడు. గురువారం నగరంలోని నాగోల్, బండ్లగూడలో గల జీబీఎల్ స్పోర్ట్ అకాడమీలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రంగారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో జిల్లా స్థాయి టోర్నమెంట్ సెలక్షన్‌లో గోపీచంద్ మొదటి స్థానం సాధించాడు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ వెంకటయ్య, అధ్యాపకులు, ఫిజికల్ డైరెక్టర్ అభినందించారు.

భాస్కర్‌రావుకు ఘన నివాళి

కూకట్‌పల్లి: సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఎస్.వి. భాస్కర్‌రావు 40వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలేసి నివాళి అర్పించారు. ఆయన చేసిన కార్మిక పోరాటాలను గుర్తు చేసుకున్నారు. వివిధ పరిశ్రమల్లో కార్మిక యూనియన్ ఏర్పాటులో కీలకంగా వ్యవహరించాడన్నారు. కార్యక్రమంలో సీపీఎం కోటిపల్లి మండల కార్యదర్శి శంకర్, నాయకులు శివప్రసాద్, ధర్మారావు, యుగంధర్ పాల్గొన్నారు.











'మై ఓన్ ట్రబుల్డ్ వరల్డ్' చిత్రప్రదర్శన



ఆర్ట్‌గ్యాలరీలో ఆకట్టుకుంటున్న చిత్రాలు

ఈనెల 26వ తేదీ వరకు కొనసాగింపు

ఉదయం 10.30 నుంచి రాత్రి 8గంటల వరకు..

మాదాపూర్: ఒక చిత్రం ఎన్నో విషయాలను చెబుతుంది. అర్థం కాని విషయాలను సైతం అర్థమయ్యేలా చేయగలదు. చిత్రకారులు తాము విన్న కథలను, ఊహా చిత్రాలను బొమ్మల రూపంలో చూపిస్తారు. అలాంటి చిత్రాలను, స్కల్ప్చర్స్, ఇన్‌స్టాలేషన్‌లను అన్నదమ్ములు, చిత్రకళాకారులు గ్లోవర్ పాల్, లెస్టర్ ఆంథోనీపాల్‌లు వేసిన చిత్రాలను చిత్రమయి స్టేట్ ఆర్ట్‌గ్యాలరీలో మై ఓన్ ట్రబుల్డ్ వరల్డ్ పేరిట చిత్ర ప్రదర్శనను ఏర్పాటు చేశారు. నగరజీవితం, మనుషుల మధ్య వ్యత్యాసాలు, జరుగుతున్న పరిణామాలు తదితర అంశాలను తెలిపే విధంగా స్కల్ప్చర్స్‌ను రూపొందించారు. వివిధ ఆర్ట్స్ కళాశాలల నుంచి వచ్చిన విద్యార్థులు చిత్రాల గురించి అడిగి తెలుసుకుంటున్నారు. కళాకారులు తాము వాడే ముడిపదార్థాలు, మెళకువలను వివరిస్తున్నారు. ఒక కళా రూపాన్ని వేయడానికి తీసుకోవాల్సిన సన్నివేశం, సందర్భం గురించి తెలియజేశారు. ప్రపంచంలో జరుగుతున్న సంఘటనలపై చిత్రాలు వేసినట్టు కళాకారులు తెలిపారు.







గ్యాలరీలో సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్న చిత్రాలు

అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి

పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే గాంధీ



జోనల్ కమిషనర్‌కు సమస్యలు వివరిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

ఆల్విన్‌కాలనీ: వివిధ డివిజన్‌లలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌ను గురువారం కలిసి కూకట్‌పల్లి పార్ట్, వివేకానంద నగర్, ఆల్విన్‌కాలనీ, హైదర్‌నగర్ డివిజన్‌లలో నెలకొన్న వివిధ సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. పెండింగ్‌లో ఉన్న పనులు త్వరగా పూర్తయ్యేలా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. వర్షాకాలంలో దెబ్బతిన్న రోడ్లను వెంటనే పునరుద్ధరించాలన్నారు. అభివృద్ధి విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని, అధికారులతో తక్షణమే చర్చించి చర్యలు తీసుకోవాలన్నారు.

పైపులైన్ పనులను పరిశీలించిన కార్పొరేటర్

బాలానగర్: రాజు కాలనీ అంబేడ్కర్ భవనం వీధిలో మంచినీటి పైపులైన్, సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానికుల విజ్ఞప్తి మేరకు అధికారులతో మాట్లాడి నూతన పైపులైన్ పనులు ప్రారంభించామన్నారు. కార్పొరేటర్‌కు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మహ్మద్ ఖాజా, పుష్పరాజ్, శ్రీనివాస్, నాగేందర్‌గౌడ్, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి

అధికారులు సమన్వయంతో పని చేయాలి



అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే గాంధీ, వెస్ట్ జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి

గచ్చిబౌలి: ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఎమ్మెల్యే గాంధీ సూచించారు. గురువారం శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ కార్యాలయంలో జడ్సీ ఉపేందర్ రెడ్డి అధ్యక్షతన అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక డ్రైవ్ చేపట్టి ఫుట్‌పాత్‌ల ఆక్రమణలను తొలగించాలని టౌన్‌ప్లానింగ్ అధికారులకు సూచించారు. లింకురోడ్డు పనులు, మంజీరా పైపులైన్ రోడ్డు పనులు, శ్రీదేవి థియేటర్ రోడ్డు విస్తరణ పనులను వెంటనే చేపట్టాలని జడ్సీ దృష్టికి తీసుకెళ్లారు. పార్కులు, వర్షాలకు దెబ్బతిన్న రోడ్ల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలన్నారు. వెస్ట్ జోనల్ కమిషనర్ ఆర్.ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ త్వరితగతిన జంక్షన్లు అభివృద్ధి చేసి ట్రాఫిక్ నివారణ చర్యలు చేపడతామని తెలిపారు. రోడ్ల విస్తరణలో స్థలం కోల్పోయిన బాధితులకు టీడీఆర్ త్వరగా ఇప్పించేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. విద్యుత్ స్తంభాలు, కేబుళ్ల మార్పిడిపై విద్యుత్‌శాఖ, వర్షాకాలం వాటర్ లాగింగ్ పాయింట్ల వద్ద వరద నివారణకు, రోడ్ల మరమ్మతులకు చర్యలు చేపట్టాలని ఆయా అధికారులను ఆదేశించారు. ఐటీ కారిడార్‌లో మెరుగైన వసతుల కల్పనకు అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మాదాపూర్ ఏడీసీపీ జయరాం, డీసీలు ముకుంద్ రెడ్డి, మోహన్ రెడ్డి, సురేష్ పాల్గొన్నారు.

సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపిన నేతలు

కూకట్‌పల్లి: బాలానగర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన నరసింహరాజును హెచ్ఏఎల్ (ఐన్‌టీయూసీ) యూనియన్ ప్రధాన కార్యదర్శి కర్క నాగరాజ్ ఆధ్వర్యంలో గురువారం పుష్పగుచ్ఛం అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఐన్‌టీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటపతి, డిప్యూటీ జనరల్ సెక్రటరీ పోలేపల్లి శ్రీకాంత్, హిందుస్థాన్ ఏరోనాటిక్స్ వర్కర్స్ యూనియన్ కోశాధికారి కుతాడి కృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

వాతావరణం చాలా కీలకం



ట్రిపుల్‌ఐటీలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు

రాయదుర్గం: వాతావరణం చాలా ముఖ్యమని, ప్రస్తుతం వివిధ రకాలుగా మారిపోతుండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ ఏఐసీ సీఈఓ రవి సర్కుననన్ పేర్కొన్నారు. ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్‌లో సోషల్ ఇంక్యుబేటర్ ఆధ్వర్యంలో కోహ్లీ రీసెర్చ్ బ్లాక్‌లో 'స్టార్టప్ ఇన్నోవేషన్ ఇన్ క్లైమేట్ యాక్షన్' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినూత్న ఆలోచనలు పరిష్కార మార్గాలను అందించడంలో స్టార్టప్‌లు కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో బ్రిటీష్ హైదరాబాద్ డిప్యూటీ హై కమిషనర్ గారెత్ విన్ ఓవెన్, ట్రిపుల్‌ఐటీ ఫ్యాకల్టీ, ఆర్ఐసీహెచ్, ఈపీఏఎం సిస్టమ్స్, స్టేట్ స్ట్రీట్స్, క్యాస్పియన్, ఐఈఈఎంఏ, కార్పొరేట్, పెట్టుబడిదారు, ఇంక్యుబేటర్ల ప్రతినిధులు, విద్యావేత్తలు, పర్యావరణ వ్యవస్థ వాటాదారులు పాల్గొన్నారు.

ల్యాప్‌టాప్ బుక్ చేస్తే నాపరాయి వచ్చింది

దుండిగల్: ఓ వ్యక్తి ఆన్‌లైన్‌లో ల్యాప్‌టాప్ బుక్ చేస్తే నాపరాయి, పాత కీ బోర్డు వచ్చింది. ఈ ఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. పోలీసుల వివరాల ప్రకారం.. దుండిగల్ గ్రామానికి చెందిన ప్రణయ్ ఈ నెల 21వ తేదిన ఆన్‌లైన్‌లో అమేజాన్ యాప్‌లో ల్యాప్‌టాప్ కొనుగోలు చేశాడు. గురువారం అమేజాన్ నుంచి పార్సిల్ రావడంతో విప్పి చూడగా.. పాత కీబోర్డు, నాపరాయి ఉండటంతో ప్రణయ్ ఆశ్చర్యపోయాడు. తాను మోసపోయానని గ్రహించి దుండిగల్ పోలీసులను ఆశ్రయించాడు. తగిన ఆధారాలతో సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని పోలీసులు సూచించారని బాధితుడు తెలిపాడు.